నమస్తే తెలంగాణ

# నిర్మల్

5 | నిజామాబాద్, గురువారం 7 మార్చి 2024 | NIRMAL

## డీఈవో ఆఫీస్ ఎదుట ధర్నా



ధర్నా చేస్తున్న ఉర్దూ మీడియం అభ్యర్థులు

ఆదిలాబాద్ రూరల్, మార్చి 6 : ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీలో న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఆదిలాబాద్ పట్టణంలోని డీఈవో కార్యాలయం ఎదుట ఉర్దూ మీడియం అభ్యర్థులు ధర్నా చేపట్టారు. ఆదిలాబాద్ జిల్లాకు కేవలం మూడు పోస్టులు కేటాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. రిజర్వేషన్లను కూడా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో ఉర్దూ మీడియం అభ్యర్థులు పాల్గొన్నారు.

## కూలిన బ్రిడ్జి





కుంటాల, మార్చి 6 : నిర్మల్ జిల్లా కుంటాల మండలంలోని కల్లూరు-బూరుగుపల్లి గ్రామాలకు అనుసంధానంగా నిర్మించిన బ్రిడ్జి కూలింది. కూలిన సమయంలో వంతెనపై ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. బూరుగుపల్లి గ్రామ రైతులు పొలాలకు వెళ్లడానికి కల్లూరు వాగుపై ఎస్సారెస్పీ ఆధ్వర్యంలో 25 ఏండ్ల క్రితం నిర్మించారు. ఈ మధ్య బ్రిడ్జిపై నుంచి భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో ఘటన చోటు చేసుకుని ఉండొచ్చని గ్రామస్తులు అభిప్రాయ పడుతున్నారు. ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టి ఇబ్బందులను తొలిగించాలని ఇరు గ్రామాల రైతులు కోరుతున్నారు.

## ప్రతి ఒక్కరికీ పథకాలు చేరాలి..

- ఆదిలాబాద్ నూతన కలెక్టర్ రాజర్షి షా
- బాధ్యతలు స్వీకరించిన అనంతరం కార్యాలయాల తనిఖీ



జైనథ్ మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ధరణి, ప్రజాపాలన దరఖాస్తుల డేటా నమోదును పరిశీలిస్తున్న నూతన కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, మార్చి 6 : అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని నూతన కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. బుధవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం జైనథ్ మండలంలోని తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధరణి, ప్రజాపాలన దరఖాస్తుల డేటా నమోదును పరిశీలించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు తెలిపారు. అర్హత ఉన్న ప్రతి దరఖాస్తును ఆమోదించి న్యాయం చేయాలన్నారు. తిరస్కరణకు గురైన దరఖాస్తులకు కారణం పొందుపర్చాలన్నారు. మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాల ద్వారా అర్హులైన వారందరూ ప్రయోజనం పొందేలా అన్ని ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కేంద్రాలు పనిదినాల్లో ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని చేస్తాయన్నారు.

### బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్

నూతన కలెక్టర్‌గా రాజర్షి షా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రెయినీ కలెక్టర్ వికాస్ మెహతో పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

### నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి.. : నూతన కలెక్టర్ రాజర్షి షా

వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని, ఇందుకు సంబంధించిన పనులు సత్వరమే ప్రారంభించాలని నూతన కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజాపాలన సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకునేందుకు ఏర్పాట్లు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

## కుష్టు అనుమానితులను గుర్తించాలి..

- 11 నుంచి 24వ తేదీ వరకు సర్వే
- జిల్లాలో 1,006 బృందాల ఏర్పాటు
- ఆదిలాబాద్ డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్




మాట్లాడుతున్న ఆదిలాబాద్ డీఎంహెచ్‌వో నరేందర్‌రాథోడ్

ఎదులాపురం, మార్చి 6 : శరీరంపై రాగి రంగు గలిగి మొద్దుబారిన మచ్చలు ఉన్న వారిని కుష్టు వ్యాధి అనుమానితులుగా గుర్తించాలని ఆదిలాబాద్ డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయ సమావేశ మందిరంలో వైద్యాధికారులు, సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. ఈ నెల 11 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్న కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు ఉద్యమం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఇంటికి వస్తున్న బృందం సభ్యులకు ప్రజలు పూర్తిగా సహకరించాలన్నారు. తమకు తాముగా పరీక్షించుకుని అనుమానిత లక్షణాలు ఉంటే బృందాలకు చూపించుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరూ భాగస్వాములై జిల్లాను కుష్టు రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి శ్రీధర్, అడిషనల్ డీఎంహెచ్‌వో (కుష్టు, ఎయిడ్స్) నివారణ అధికారి గజానన్ పాల్గొన్నారు.

## ఆర్టీసీ డిపోలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

భైంసా, మార్చి 6 : పట్టణంలోని ఆర్టీసీ డిపోలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఉద్యోగులు ఆటాపాటలతో సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ అమృత, అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత, చందు, అంబాదాస్, విజయలక్ష్మి పాల్గొన్నారు.



ఖానాపూర్ పట్టణంలోని తెలంగాణ చౌరస్తాలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# ఎల్ఆర్ఎస్‌పై కాంగ్రెస్ దగా

నాడు ఫ్రీ.. నేడు ఫీజు..

## ఉచితంగా చేస్తామని హ్యాండిచ్చారు..

## రూ.20 వేల కోట్లు దండుకోవడానికి యత్నం

- 25 లక్షల కుటుంబాలపై ఆర్థిక భారం మోపడమే లక్ష్యం
- కేటీఆర్ పిలుపు మేరకు బీఆర్ఎస్ నాయకుల ఆందోళన
- ధర్నాలు, రాస్తారోకోలతో దద్దరిల్లిన నియోజకవర్గ కేంద్రాలు
- పాల్గొన్న ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, నాయకులు

*అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీ మేరకు లే అవుట్ రెగ్యులైజేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్)ను ఉచితంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు ధర్నాలు నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు పిలుపు మేరకు బుధవారం అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నాలు, రాస్తారోకోలు చేశారు. ఈ ఆందోళన కార్యక్రమాల్లో బోథ్‌లో ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌కుమార్, ఖానాపూర్‌లో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్, నిర్మల్‌లో మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, బీఆర్ఎస్ పార్టీ నిర్మల్ పట్టణ అధ్యక్షుడు రాములు పాల్గొని మాట్లాడారు. 25 లక్షల మంది నుంచి దాదాపు రూ.20 వేల కోట్లు దండుకోవాలని చూస్తున్నదని ధ్వజమెత్తారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటరెడ్డి వెంకటరెడ్డి, సీతక్క, ఉప ముఖ్యమంత్రి విక్రమార్కలు ఎల్ఆర్ఎస్‌కు డబ్బులు కట్టవద్దని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఉచితంగా అమలు చేస్తామన్న విషయాన్ని గుర్తు చేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలని డిమాండ్ చేశారు.* **- నిర్మల్ (నమస్తే తెలంగాణ)/బోథ్/ఖానాపూర్/నిర్మల్ అర్బన్, మార్చి 6**



బోథ్ ధర్నా శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

### బోథ్ నియోజకవర్గ కేంద్రంలో..

ఆదిలాబాద్ జిల్లాలోని బోథ్ నియోజకవర్గ కేంద్రంలో కాంగ్రెసోళ్లు ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా చేపట్టాలని బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ రాస్తారోకోలో స్థానిక ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. ప్రజల సొమ్ము దోచుకోవడానికే కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ పథకాన్ని తీసుకొచ్చిందని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో వద్దన్న కాంగ్రెస్ ఇప్పుడు అధికారంలోకి రాగానే అమలు చేయాలని చూస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దాదాపు రూ.20 వేల చోట్ల డబ్బులు దండుకోవాలని చూస్తున్నదని ధ్వజమెత్తారు. ఎల్ఆర్ఎస్ కోసం ప్రజలు ఎవరు ప్రభుత్వానికి డబ్బు కట్టవద్దన్నారు. ఎన్నికల సమయంలో ఆచరణ సాధ్యం కానీ హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు మోసం చేస్తున్నదని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో బోథ్, ఇచ్చోడ, నేరడిగొండ ఎంపీపీలు నివాస్, నిమ్మల ప్రీతంరెడ్డి, రాథోడ్ సజన్, జడ్పీటీసీలు సంధ్యారాణి, రాజు, సుధాకర్, పార్టీ మండల కన్వీనర్‌లు నారాయణరెడ్డి, కృష్ణారెడ్డి, నాగయ్య, రుక్మణ్‌సింగ్, మొట్టె కిరణ్‌కుమార్, తిరుమల్‌గౌడ్, సురేందర్ యాదవ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

### ఖానాపూర్‌లో నియోజకవర్గంలో..

ఖానాపూర్ పట్టణంలోని తెలంగాణ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్య జాన్సన్ నాయక్ మాట్లాడుతూ.. ఎల్ఆర్ఎస్ పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం 25 లక్షల కుటుంబాలపై ఆర్థిక భారం మోపాలని చూస్తున్నదని మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ఉచితంగా క్రమబద్ధీకరణ చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు అండగా బీఆర్ఎస్ పోరాటం చేస్తున్నదని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు రాజగంగన్న, సుమన్, మహేందర్, రాము నాయక్, నారాయణ, రాజు, ప్రదీప్ పాల్గొన్నారు.

### నిర్మల్ నియోజకవర్గ కేంద్రంలో..

నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ పార్టీ నాయకులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మల్ మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మారుగొండ రాములు మాట్లాడుతూ.. పేదల సంక్షేమాన్ని కాంగ్రెస్ పార్టీ విస్మరిస్తున్నదని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో ధర్మాజీ రాజేందర్, గండ్రత్ రమణ, రాజు, శ్రీకాంత్ యాదవ్, శ్రీనివాస్, అనిల్, నర్సయ్య, గండ్రత్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



నిర్మల్ అర్బన్ : మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మర్ ఈశ్వర్



నిర్మల్ అర్బన్ : ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు

## మోదీ మహిళా వ్యతిరేక విధానాలను ఖండించాలి

- ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి హరిత
- కుభీర్ మండలంలో మహిళలతో ర్యాలీ




కుభీర్‌లో ర్యాలీ తీస్తున్న మహిళలు

కుభీర్, మార్చి 6 : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మహిళా వ్యతిరేక విధానాలకు నిరసిస్తూ ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో మహిళలు వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.హరిత ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మహిళల నిర్ణయాధికారాన్ని కాలరాసే పితృస్వామ్య భావజాలాన్ని బలోపేతం చేసే ప్రధాని మోదీ విధానాలను ప్రతి ఒక్కరూ ఖండించాలని హరిత పిలుపును ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పీవోడబ్ల్యూ నాయకులు లక్ష్మి, అరుణ, పుష్పలత, సుశీల పాల్గొన్నారు.

## కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

నిర్మల్ టౌన్, మార్చి 6 : నిర్మల్ నియోజకవర్గంలోని షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి బుధవారం 220 మందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రత్నకల్యాణి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. అనంతరం నిర్మల్ జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియాన్ని ప్రారంభించారు. ఇందులో నిర్వాహకులు నందకుమార్, నాయకులు పాల్గొన్నారు.

### నారీశక్తి వందన్ అభియాన్‌లో ఎమ్మెల్యే

మహిళల కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'నారీశక్తి వందన్ అభియాన్' కార్యక్రమం నిర్మల్ పట్టణంలోని ఆర్‌కే కన్వెన్షన్ హాలులో బుధవారం జరిగింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రత్యక్ష ప్రసారాన్ని నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి వీక్షించారు.



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

## పంటల మార్పిడిపై దృష్టి సారించాలి..



ఇచ్చోడ : వీసీలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి



బోథ్ : వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఇచ్చోడ, మార్చి 6 : పంటల మార్పిడిపై రైతులు దృష్టి సారించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని రైతువేదికలో వీడియో కాన్ఫరెన్స్ యూనిట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం రైతులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం పంటల బీమాకు డబ్బులు చెల్లిస్తున్నదన్నారు. త్వరలో వ్యవసాయ పనిముట్లకు సబ్సిడీ అందజేస్తామని తెలిపారు. రైతులు పంటల మార్పిడిపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ ఏడీ శ్రీనివాస్, వ్యవసాయ శాఖ ఏడీ రాంకిషన్, మండల ఏవో జాదవ్ కైలాశ్ పాల్గొన్నారు.

### రైతు నేస్తంపై వీసీ..

బోథ్, మార్చి 6 : వ్యవసాయంపై రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వడం కోసం ప్రభుత్వం ప్రారంభించిన రైతునేస్తంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పాల్గొన్నారు. బోథ్ నియోజకవర్గ కేంద్రంలో రైతు వేదిక ఏర్పాటు చేయగా హాజరయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2,601 రైతు వేదికలను మొదటి విడుతలో 110 వేదికల్లో ప్రభుత్వం కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుల శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, ఏడీఏ శ్రీధర్‌స్వామి, వ్యవసాయ అధికారులు వెండి విశ్వామిత్ర, ప్రమోద్‌రెడ్డి, భాస్కర్, జిల్లా కో-ఆపరేటివ్ అధికారి మోహన్ పాల్గొన్నారు.